## క్లుప్తంగా

### గుండెపోటుతో హెచ్‌ఎం మృతి


హెచ్‌ఎం దన్నాన తిరుపతిరావు(ఫైల్)

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎమ్‌గా పనిచేస్తున్న దన్నాన తిరుపతి రావు గుండెపోటుతో కన్నుమూశారు. సహచర ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిరావు విజయనగరం తోటపాలెంలో నివాసముంటున్నారు. శనివారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన పాచిపెంటలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. హెచ్‌ఎం మృతికి ఎంఈఓలు మూర్తి, విజయకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది సంతాపం తెలిపారు.

### నీమాస్త్రం తయారీపై అవగాహన


నీమాస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆదివారం నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీఆర్‌పీఎ రామలక్ష్మి మాట్లాడుతూ.. 10 లీటర్ల దేశీయ ఆవుమూత్రం, 10 కిలోల వేప ఆకులు, 3 కిలోల ఆవు పేడను కలిపి 48 గంటలు నిల్వ ఉంచితే నీమాస్త్రం తయారవుతుందని చెప్పారు. అన్ని రకాల పంటల్లో చీడ, పీడలు, తెగుళ్ల నివారణకు బాగా పనిచేస్తుందని చెప్పారు. మూడు నెలల వరకు నిల్వ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

### పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- రాష్ట్రోపాధ్యాయ సంఘం డిమాండ్


కలెక్టరేట్ ఎదుట రాష్ట్రోపాధ్యాయ సంఘ కార్యకర్తల నిరసన

విజయనగరం అర్బన్: కంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా రూపొందించిన గ్యారెంటెడ్ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రయోజనం లేదన్నారు. పాత పెన్షన్‌కు ప్రత్యామ్నాయంగా రూపొందించిన దేనినీ అంగీకరించమని తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నాయకులు డి.శ్యామ్, వి.గోవిందరావు, జిల్లా ఉపాధ్యక్షులు చిట్టిబాబు, ఎంపి స్వామి, బి.అడివయ్య, రాజ్యలక్ష్మి, జిల్లా కార్యదర్శులు ఈశ్వరరావు, తులసీరామ్, ఎస్.బంగారయ్య, అర్జునుడు, వాసుదేవ్, శ్రీనివాసరావు, రవి, రాంబాబు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

### పాత పెన్షన్ విధానమే శాశ్వత పరిష్కారం

- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసరావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌కు (సీపీఎస్) ప్రత్యామ్నాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించినట్లు చెబుతున్న యూపీఎస్ వల్ల ఎటువంటి లాభం ఉండదని... పాత పెన్షన్ విధానమే శాశ్వత పరిష్కారమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో పీఆర్‌టీయూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి పాతపెన్షన్ స్థానంలో సీపీఎస్ అమల్లోకి వచ్చిందన్నారు. ఆ రోజు ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాలిట చీకటి రోజుగా పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావాడ రాంబాబు, శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజశేఖర్, శంకర్‌నాయుడు, విజయనగరం అర్బన్ ప్రధాన కార్యదర్శి చిట్టి రామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# అరకొర సరుకులే గతి..

- అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు కట్
- కేంద్రాల నిర్వహణను గాలికొదిలేసిన వైనం
- అర్ధాకలితో అలమటిస్తున్న చిన్నారులు

| భోగాపురం ప్రాజెక్ట్ పరిధిలో వివరాలు.. | |
|---|---|
| అంగన్‌వాడీ కేంద్రాలు : | 272 |
| మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు : | 210 |
| మినీ అంగన్‌వాడీ కేంద్రాలు : | 62 |
| గర్భిణులు : | 1071 |
| బాలింతలు : | 911 |
| 0 నుంచి ఆరు నెలల్లోపు చిన్నారులు : | 915 |
| ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు పిల్లలు : | 5,441 |
| మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులు : | 3,129 |


గుంపాం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, చిన్నారులు (ఫైల్)

పూసపాటిరేగ: మాతా, శిశు మరణాల నివారణలో కీలకంగా పనిచేసే అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో అందించే పౌష్టికాహారం నిరుపేద గర్భిణులు, తల్లులు, చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేశారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను గాలికొదిలేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు సక్రమంగా సరఫరా కావడం లేదు. భోగాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి కందిప్పు ఇవ్వలేదు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. దీంతో చిన్నారుల అర్ధాకలి చూడలేక కార్యకర్తలు అప్పు తెచ్చి పప్పు అన్నం పెడుతున్నారు. ఈ పరిణామాలు కేంద్రాల కార్యకర్తలపై మరింత ఆర్థిక భారాన్ని పెంచుతున్నాయి. జూలై, ఆగస్టు నెలకు సంబంధించి సరుకులు సరఫరా చేయలేదు.

**గాడితప్పుతున్న నిర్వహణ**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా ఒక్కొక్కరికీ మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో నూనె, 25 కోడి గుడ్లు, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల రాగిపిండి, పావుకిలో పప్పుచెక్కీ, పావుకిలో బెల్లం, పావుకిలో ఎండు ఖర్జూరం, కిలో అటుకులు పంపిణీ చేస్తారు. ప్రతి కేంద్రంలో నమోదైన గర్భిణులు, బాలింతలు, పిల్లల సంఖ్యను బట్టి నెలాఖరులో తదుపరి నెలకు సంబంధించిన సరుకులు ముందుగానే సరఫరా చేస్తారు. ఒకపక్క సరుకులు సక్రమంగా సరఫరా చేయలేని ప్రభుత్వం కార్యకర్తల న్యాయపరమైన సమస్యలను కూడా పరిష్కరించడం లేదు. వేతనాలు పెంచాలని, అద్దె బకాయిలు మంజూరు చేయాలని, నిర్వహణ ఖర్చులు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


రామచంద్రపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

## డ్రగ్స్ సరఫరా చేస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ గోవిందరావు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

డెంకాడ: డ్రగ్స్ సరఫరా చేసినా, విక్రయించినా చర్యలు కఠినంగా ఉంటాయని విజయనగరం డీఎస్పీ గోవిందరావు అన్నారు. మండలంలోని బొడ్డవలసలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యానికి చాలా హానికరమన్నారు. ఇలాంటి నిషేధిత మత్తు పదార్థాలు రవాణా చేసినా, విక్రయించినా చట్టప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. అలాగే వాహనచోదకులు తప్పనిసరిగా రహదారి భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. వినాయక ఉత్సవాలు నిర్వహించాలనుకునే వారు పోలీస్ అనుమతి పొందాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతి విగ్రహాల ప్రదర్శన


మట్టి గణపతి విగ్రహాన్ని డిప్యూటీ మేయర్ శ్రావణికి అందజేస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: స్పార్క్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ, ప్రదర్శన కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఆరు వరకు సుమారు వంద రకాల మట్టి గణపతి విగ్రహాలను ప్రదర్శనలో ఉంచుతామని సొసైటీ ప్రతినిధి పద్మనాభం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ.. చెరువులు, జల, జీవ జాతుల సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మల వల్ల తీవ్ర అస్వస్థతకు గురవుతామన్నారు. 2007 నుంచి మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షురాలు భవానీ పద్మనాభం తెలిపారు. ప్రతిరోజూ ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా విగ్రహాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో చంద్రిక, హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

### • గోతులమయం..


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నుంచి డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు మొత్తం గోతులతో నిండిపోవడంతో డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - విజయనగరం ఫోర్ట్

### • ఆదమరిస్తే అంతే..


మండలంలోని చినపతివాడలో ఆర్‌అండ్‌బీ రహదారి ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. గ్రామ ముఖ ద్వారం మలుపు వద్ద రహదారి సమీపంలో పెద్ద గొయ్యి ఏర్పడడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఆ రహదారి మీదుగా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

- పూసపాటిరేగ

### నైతికతే నిజమైన స్వేచ్ఛ

విజయనగరం టౌన్: నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే అంశంతో జమాతే ఇస్లామీ హింద్ భారత దేశ వ్యాప్తంగా నెల రోజుల దేశవ్యాప్త ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తోందని జమాత్ మహిళా విభాగం అధ్యక్షురాలు సయ్యద్ షబ్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కార్యాలయంలో విజయనగరం జమాత్ ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజంలో నైతిక విలువలు అడుగంటి పోతున్నాయని.. వాటిని పునరుద్ధరించాల్సిన బాధ్యత దేశ పౌరులపై ఉందన్నారు. కార్యక్రమంలో షేక్ నజ్మా, ముంతాజ్, జైనాబ్, తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన ఆదిభట్ల ఆరాధనోత్సవాలు

- బొంతలకోటికి హరికథా చూడామణి బిరుదు
- సాహితీ సంస్థలకు ప్రోత్సాహం : నగర డిప్యూటీ మేయర్ శ్రావణి


హరికథా చూడామణి బిరుదు ప్రదానం చేస్తున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, తదితరులు

విజయనగరం టౌన్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు ఆరాధనోత్సవాలు స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో రెండో రోజైన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మండా వరలక్ష్మి భాగవతారిణి రుక్మిణీ కల్యాణం హరికథ ఆద్యంతం ఆకట్టుకుంది. సాయంత్రం ఆదిభట్ల రవి భాగవతార్ పార్వతీపరిణయం హరికథ రక్తి కట్టించింది. అనంతరం రాత్రి నిర్వహించిన సభా కార్యక్రమానికి నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాహితీ సంస్థలకు తమ కుటుంబం చేస్తున్న సేవ ఎనలేనిదన్నారు. నాటికి, నేటికీ ఎప్పటికీ నిరంతరాయంగా తమ సహాయ, సహకారాలను అందజేస్తూనే ఉంటుందన్నారు. అనంతరం విశాఖకు చెందిన బొంతలకోటి యతిరాజు భాగవతార్‌కు హరికథా చూడామణి బిరుదుతో ఘనంగా సత్కరించారు. అనంతరం పురస్కార గ్రహీత నిర్వహించిన భక్త ధ్రువ కథాగానం ఆద్యంతం ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, డాక్టర్ వై.బాబూరావు, పువ్వాడ సత్య వెంకట భాస్కర్, కోలపల్లి ధర్మశ్రీరామబాబా, రంగారావు దొర, భోగరాజు సూర్యలక్ష్మి, కాళ్ల నిర్మల పాల్గొన్నారు.

### అన్నసమారాధన

విజయనగరం టౌన్: పట్టణంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమణమ్మ, మారమ్మ, రమేష్‌ప్రకాష్, శోభారాణి, భీమరాజు, సోమశేఖర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

### రక్త పరీక్షలు చేయించుకోవాలి..

- డాక్టర్ మహేంద్రగిరి

గంట్యాడ : మూడు రోజులకు మించి జ్వరం ఉన్నా, చిగుళ్ల నుంచి రక్తస్రావం జరుగుతున్నా వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ మహేంద్రగిరి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో గ్రామీణ వైద్యుల సంఘ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగీ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్పారు. రోగులు అశ్రద్ధ వహించకుండా చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జయశంకర్ కృష్ణ, గ్రామీణ వైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గెద్ద చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య


సమస్యలపై ఆరా తీస్తున్న కమిషనర్ పి.నల్లనయ్య

విజయనగరం: వర్షాలు కురిసే సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. ఈ మేరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం పర్యటించి పరిస్థితులను గమనించారు. లోతట్టు ప్రాంతాలకు చేరుకుని అక్కడ నెలకొన్న పరిస్థితులను అంచనా వేశారు. లోతట్టు ప్రాంతాల నుంచి వర్షపు నీరు బయటకు పోయేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కుసుమగజపతి మార్గ్ ప్రాంతంలో పర్యటించి కాలువలను సరిచేయాలని సూచించారు. రింగ్ రోడ్డులో నగరపాలక సంస్థకు చెందిన భవనాన్ని సచివాలయంగా మార్చాలని ఆదేశించారు. సింగపూర్ సిటీకి వెళ్లే మార్గంలో కోమటి చెరువు వద్ద పాక్షిక మరమ్మతులు చేపట్టి.. రహదారిని సరిచేయాలని చెప్పారు. అక్కడ నుంచి గంటస్తంభం ప్రాంతానికి చేరుకుని మార్కెట్ ఏరియాలో పర్యటించారు. రోడ్లపై చెత్త వేయకుండా వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలని పారిశుధ్య పర్యవేక్షకులను ఆదేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు మూడు బృందాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ఆయా ప్రాంతాల పారిశుధ్య పర్యవేక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ గుప్తా పుట్టినరోజు సందర్భంగా వాసవీ క్లబ్ వనిత విజయం వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్‌వీఎస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్లబ్ జిల్లా గవర్నర్ ఆత్మకూర్తి సాంబమూర్తి మాట్లాడుతూ, రక్త నిల్వలు పెంపొందించడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానానికి సంబంధించి ఎటువంటి అపోహలను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ వనిత విజయం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి, కార్యదర్శి కాపుగంటి రాధిక, కోశాధికారి గుంపిన దేవి విద్యాలక్ష్మి, ఇందిర, నారాయణరావు, చెన్నా బుచ్చి జనార్దనరావు, రత్నారావు, విజ్జపు విజయకుమార్, సముద్రాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పోటీతత్వం పెంపొందించుకోవాలి


రోటరీ క్లబ్ యూత్ మంత్ కాంపిటేషన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు

- ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు

విజయనగరం: రోటరీ క్లబ్ విజయనగరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూత్ మంత్ కాంపిటేషన్స్‌లో పాల్గొన్న యువత పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీలను ఆదివారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ -3020 గవర్నర్ డాక్టర్ ఎంవీ రావు మాట్లాడుతూ.. ప్రతి ఏడాదీ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యువతకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎ.వినోద్‌కుమార్, కార్యదర్శి నాగప్రకాష్, యూత్ మంత్ డైరెక్టర్ హేమకుమార్, కౌన్సిలర్ రాధికారాణి, కో చైర్‌పర్సన్ సూర్యలక్ష్మి, నీతా విజ్వాని, మంజుల, నాగరాజు పాల్గొన్నారు.

## సంతోషిమాత ఆలయంలో చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: పట్టణంలోని మయూరి కూడలి వద్దనున్న సంతోషిమాత ఆలయంలో ఆదివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఇటీవల 1100 కిలోల పసుపు కొమ్ములతో సహస్రకుంకుమార్చన చేసి వాటిని ఆలయ ఆవరణలో భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత